క్లుప్తంగా

శతశాతం ఉత్తీర్ణతకు కృషి చేయాలి..



స్థానిక ఉన్నత పాఠశాలలో మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి ఎన్వీ రమణ

సీతానగరం: పదో తరగతి శతశాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని స్థానిక ఉన్నత పాఠశాల ప్రత్యేక అధికారి, తహసీల్దార్ ఎన్వీ రమణ అన్నారు. శనివారం స్థానిక ఉన్నత పాఠశాలను సందర్శించి, ఉపాధ్యాయుల బోధనా తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థి వృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 రమణ, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆటల పోటీలు



ప్రాథమిక పాఠశాల మైదానంలో ఆటల పోటీలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

సీతానగరం: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు వాలీబాల్, చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక శాఖా గ్రంథాలయ ప్రతినిధి బి.వెంకటరమణ, పాఠశాల పీడీ ఎం. శ్రీనివాసరావు మాట్లాడుతూ, పోటీల్లో గెలుపోటములు సహజమన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.

ఇళ్ల నిర్మాణాలకు చర్యలు



ఎంపీడీఓ కృష్ణమహేష్ రెడ్డి

సీతానగరం: జగనన్న ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీడీఓ బి. కృష్ణమహేష్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ, పేదలందరికీ సొంతిల్లు ఉండాలనే ఉద్దేశంతో స్థలం, నిర్మాణ సామగ్రి, నగదు సాయం చేసినట్లు చెప్పారు. ఇప్పటికే చాలా ఇళ్లు పూర్తయి గృహ ప్రవేశాలు జరగా... కొన్నిచోట్ల పనులు పూర్తి కాలేదన్నారు. అటువంటి వారందరూ త్వరగా నిర్మాణాలు పూర్తి చేయాలని సూచించారు.

ఫెన్సింగ్ పోటీల్లో పార్వతీపురం విద్యార్థుల ప్రతిభ



రాష్ట్రస్థాయి మెడల్స్ సాధించిన విద్యార్థులు

పార్వతీపురం టౌన్: రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీల్లో స్థానిక అనిల్ శర్మ తైక్వాండో అకాడమీకి చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు కోచ్ అనిల్ శర్మ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఈ నెల 1,2,3 తేదీల్లో నంద్యాలలో నిర్వహించిన 67వ రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో పార్వతీపురానికి చెందిన హర్షితశర్మ సిల్వర్ మెడల్, చైతన్య జ్యోషిశర్మ బ్రాంజ్ మెడల్ సాధించారని తెలిపారు. వీరు ఈ నెల 20, 24 తేదీల్లో జమ్మూకశ్మీర్‌లో నిర్వహించనున్న జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

24న సామాజిక సాధికార బస్సుయాత్ర

పాలకొండ: నియోజకవర్గంలో ఈ నెల 24వ తేదీన చేపట్టబోయే సామాజిక సాధికార బస్సుయాత్రను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి కోరారు. శనివారం స్థానిక పట్టణంలోని ఏఎంజీ కన్వెన్షన్ హాల్‌లో ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, పార్టీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు పరీక్షిత్‌రాజుతో కలిసి నియోజకవర్గ పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమైన ఆమె యాత్ర ఏర్పాట్లు, నిర్వహణపై దిశానిర్దేశం చేశారు. ప్రతీ గ్రామం నుంచి పెద్దఎత్తున నేతలు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు, సానుభూతిపరులు యాత్రకు వచ్చేలా చూడాలన్నారు. ఇప్పటినుంచే గ్రామాల వారీగా నేతలను సమాయత్తం చేయాలని కోరారు. సమావేశంలో ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, కార్పొరేషన్ల డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీ



ర్యాలీలో తాడికొండ పీహెచ్‌సీ సిబ్బంది

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని తాడికొండ గ్రామంలో సికిల్ సెల్ ఎనీమియా(రక్తహీనత) నివారణపై అవగాహన ర్యాలీ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం.బుద్ధేశ్వరరావు, సిబ్బంది వ్యాధి లక్షణాలు, వ్యాధి బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు.

కొండ కోనల్లో శివయ్య..



మూలక్కాయవలస గ్రామంలోని పురాతన ఆలయం కాశీవిశ్వేశ్వరాలయం

- మక్కువలో ప్రఖ్యాత శివాలయాలు
- కార్తీకంలో భక్తుల రద్దీ

మక్కువ: మండలంలోని ఎత్తైన కొండల్లో.. పచ్చని వాతావరణంలో వెలసిన శివాలయాలు ఆధ్యాత్మిక పరిమళాలు వెదజల్లుతున్నాయి. ఆలయ సమీపంలో పుణ్య నదులు ప్రవహిస్తుండడంతో వాతావరణం ఆహ్లాదకరంగా ఉండడంతో స్వామి దర్శనానికి భక్తులు పోటెత్తుతున్నారు. ఏటా కార్తీకమాసం, శివరాత్రి, ఇతర పర్వదినాల్లో ఆయా ఆలయాలు భక్తులతో కళకళలాడుతుంటాయి.

దేవతలే నిర్మించారు..

మండలంలోని కాశీపట్నం పంచాయతీ ములక్కాయవలసలో గల కాశీవిశ్వేశ్వరాలయం ఎంతో ప్రసిద్ధిగాంచింది. పురాతన ఆలయాల్లో ఒకటైన ఈ ఆలయానికి ఎంతో చరిత్ర ఉంది. ఈ ఆలయాన్ని క్రీస్తుశకం 455 సంవత్సరంలో దేవతలు నిర్మించారని భక్తుల విశ్వాసం. కాశీవిశ్వేశ్వరాలయం స్తంభాలపై జైపూర్ మహారాజులు పేర్లు రాసి ఉన్నాయి. కార్తీక మాసంలో, శివరాత్రి సమయంలో వేలాదిమంది భక్తులు సుదూర ప్రాంతాల నుంచి వచ్చి స్వామిని దర్శించుకుంటారు.

కాశీ ఆలయం మాదిరిగా..

చెముడు గ్రామంలో ఉన్న భీమలింగేశ్వరాలయం వాస్తు ప్రకారంగా కాశీలో ఉన్న శివాలయం మాదిరిగా అప్పట్లో నిర్మించారని భక్తుల నమ్మకం. ఆలయం ముందుభాగాన సువర్ణముఖీ నది ప్రవాహం, దక్షిణాన శ్మశానవాటిక ఉండడం విశేషం. రెండువందల ఏళ్ల కిందట గ్రామ సమీపంలో ఉన్న తేన్లుకొండపై శివలింగం వెలిసిందిని.. అక్కడ నుంచి తమ పూర్వీకులు శివలింగాన్ని తీసుకొని వచ్చి బోడికొండపై ఉంచి ఆలయం నిర్మించారని స్థానికులు చెబుతున్నారు.



చెముడులో బోడికొండపై పురాతన భీమలింగేశ్వరాలయం

12 తరాల పురాతన ఆలయం ఉమాశాంతేశ్వరాలయం..

శాంతేశ్వరం గ్రామ సమీపంలో ఉన్న శాంతేశ్వరం కొండపై ఉన్న ఉమాశాంతేశ్వరాలయం ప్రాచీనమైన ఆలయం. 12 తరాల కిందటి ఆలయంగా భక్తులు చెబుతున్నారు. ఎత్తైన కొండపై ఆలయం ఉంది. ఆలయం పైభాగాన నుంచి దిగువకు చూస్తే వాతావరణం ఎంతో ఆహ్లాదకరంగా కనిపిస్తుంది. కొండగుహలో శివలింగం ఉండడంతో ఆ ప్రదేశంలో నాగుపాము ఎప్పుడు తిరుగుతుంటుందని భక్తులు చెబుతుంటారు. ఆలయ మెట్టుకు ఇరువైపులా విఘ్నేశ్వరస్వామి, అయ్యప్పస్వామి, అర్ధనారీశ్వరుడు, సరస్వతీదేవి, సుబ్రమణ్యస్వామి విగ్రహాలను ప్రతిష్ఠించారు.

మక్కువలో పంచాయతన ఆలయం..

మండల కేంద్రంలోని భమరాంబిక మల్లికార్జున స్వామి (పంచాయతన ఆలయం) సువర్ణముఖీ నది ఒడ్డున వెలిశాడు. ఈ ఆలయంలో శివలింగంతో పాటు విఘ్నేశ్వరుడు, సుబ్రహ్మణ్యస్వామి, అయ్యప్పస్వామి, వేంకటేశ్వరస్వామి, సూర్యనారాయణమూర్తి, షిర్డీ సాయిబాబా, భ్రమరాంబికా దేవి, సంతోషమాత, శనీశ్వర విగ్రహాలు ప్రతిష్ఠంచారు. కేరళలోని అయ్యప్పస్వామి ఆలయంలో జరుగుతున్న విధంగా ఇక్కడ పూజా విధానం జరగడం విశేషం.



మక్కువలోని వెలసిన భ్రమరాంబికా మల్లికార్జున స్వామి దేవాలయం



శాంతేశ్వరం గ్రామ సమీపంలో కొండపై వెలిసిన ఉమాశాంతేశ్వరాలయం



మక్కువలో సాయిరామలింగేశ్వరాలయం

స్పటిక లింగేశ్వరుడు..

స్థానిక సాయి రామలింగేశ్వరాలయాన్ని ఐదేళ్ల కిందట మక్కువలో నిర్మించారు. జిల్లాలో రెండో స్పటిక లింగం ఇదే కావడం విశేషం. అలాగే శంబరలో భవానీ సహిత పావని చంద్రమౌళీశ్వరుడు, డీ.శిర్లాం గ్రామంలో సోమేశ్వరాలయం, మక్కువలోవెంకటభైరిపురం, తూరుమామిడి, కొయ్యానపేట గ్రామాలలో శివాలయాలున్నాయి.

శాంతేశ్వరాలయానికి ఇలా చేరుకోవచ్చు..

మండలంలోని శాంతేశ్వరం గ్రామ సమీపంలో ఉన్న ఉమా శాంతేశ్వరాలయానికి వెళ్లాలంటే సాలూరు, బొబ్బిలి, పార్వతీపురం నుంచి మక్కువకు ఆర్టీసీ బస్సులు మక్కువ వస్తుంటాయి. మక్కువ నుంచి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న శాంతేశ్వరానికి ఆటోలు అందుబాటులో ఉంటాయి.

చెముడుకు ఆటోల సదుపాయం..

మక్కువ నుంచి నాలుగు కిలోమీటర్ల దూరంలో చెముడు గ్రామం ఉంది. ఇక్కడ ఉన్న భీమలింగేశ్వరుడ్ని దర్శించుకోవడానికి మక్కువ నుంచి ఆటోలుంటాయి. అలాగే సాలూరు నుంచి శంబర గ్రామం మీదుగా చెముడు చేరుకోవచ్చు.

కాశీవిశ్వేశ్వరాలయానికి ఇలా చేరుకోవచ్చు..

బొబ్బిలి, పార్వతీపురం మండలాల నుంచి వచ్చేవారు మక్కువ ముందున ఉన్న ములక్కాయవలస గ్రామంలో దిగి ఆలయానికి చేరుకోవచ్చు. అలాగే సాలూరు నుంచి వచ్చిన భక్తులు మక్కువ శ్రీదేవి థియేటర్ జంక్షన్ వద్ద దిగి కాలినడకన ఆలయానికి చేరుకోవచ్చు.

పాడి పశువులకు మెరుగైన వైద్యం

- పశు సంవర్థక శాఖ ఎ.డి దీనకుమార్

సీతానగరం: డాక్టర్ వైఎస్సార్ సంచార పశువైద్య వాహనం ద్వారా పడి పశువులకు రైతుల ఇళ్ల వద్దే మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు పశు సంవర్థక శాఖ ఎ.డి సీహెచ్ దీనకుమార్ అన్నారు. మండలంలోని పనుకుపేటలో ఎం. భానుకు చెందిన ఆవు ఇటీవల దూడకు జన్మనిచ్చింది. ఈ దూడకు (23 రోజులు) అరుదైన శస్త్రచికిత్స విజయవంతంగా చేశారు. ఈ సందర్భంగా ఆయన శనివారం దూడను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, 2023 ఫిబ్రవరి నుంచి సంచార వాహనం ద్వారా మండలంలో 958 పశువులకు వైద్యసేవలు అందించామన్నారు. ఇందులో 200 పశువులకు శస్త్రచికిత్సలు, 75 పశువులకు గర్భకోశవ్యాధి చికిత్సలు అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది హేమంత్, జానకి, ఆశా పాల్గొన్నారు.



శస్త్రచికిత్స చేసిన దూడతో డాక్టర్ సీహెచ్ దీనకుమార్, రైతు, తదితరులు

డిసెంబర్ 9న జాతీయ లోక్ అదాలత్

- రెండవ అదనపు జిల్లా జడ్జి ఎస్. దామోదరరావు

పార్వతీపురంటౌన్: వచ్చే నెల 9న జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించనున్నట్లు రెండో అదనపు జిల్లా జడ్జి ఎస్. దామోదరరావు తెలిపారు. జాతీయ లోక్ అదాలత్ నిర్వహణపై సంబంధిత అధికారులతో శనివారం స్థానిక జిల్లా కోర్టు ప్రాంగణంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కక్షిదారులు జాతీయ లోక్ అదాలత్‌ను ఉపయోగించుకోవాలని కోరారు. జాతీయ లోక్‌అదాలత్‌లో వెలువరించే తీర్పులకు పరిపూర్ణత ఉందన్నారు. రాజీమార్గంలో పరిష్కారం జరుగుతుందని.. ఈ అవకాశాన్ని కక్షిదారులందరూ వినియోగించుకొని సాధ్యమైనంతవరకు కేసులు తగ్గించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి ఎ. రమేష్, అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ డి. సౌజన్య, సెకెండ్ క్లాస్ మెజిస్ట్రేట్ వి. నాగేశ్వరరావు, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎన్. శ్రీనివాసరావు, పార్వతీపురం రూరల్ సీఐ సీహెచ్ స్వామినాయుడు, ఎస్ఈబీ సీఐ ఎల్. ఉపేంద్ర, న్యాయవాదులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రెండో అదనపు జిల్లా జడ్జి ఎస్. దామోదరరావు

ధాన్యం కొనుగోలుపై అవగాహన తప్పనిసరి

సీతానగరం: ధాన్యం కొనుగోలుపై టెక్నికల్ సహాయకులు, వ్యవసాయ సహాయకులు అవగాహన పెంచుకోవాలని సివిల్ సప్లైస్ కార్పొరేషన్ అధికారులు కోరారు. మండలంలోని పెదబోగిలి ఆర్బీకేలో ధాన్యం కొనుగోలుకు సంబంధించి ఏఓ ఎస్. అవినాష్ అధ్యక్షతన సివిల్ సప్లైస్ టెక్నికల్ సహాయకులు, వీఏఏల, డీఈఓలకు శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సివిల్ సప్లైస్ ప్రతినిధులు జి. వనిత, పి. రాజశేఖర్, సీఎస్‌సీఏ కల్యాణ్ ధాన్యం కొనగోలుపై వివరించారు.

నాణ్యతా ప్రమాణాలను పాటించాలి..

పాచిపెంట: ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఏఓ కె.తిరుపతిరావు అన్నారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ధాన్యం కొనుగోళ్లపై వ్యవసాయ సహాయకులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పౌర సరఫరాల సాంకేతిక శిక్షకురాలు తులసి మాట్లాడుతూ, గ్రామాలలో ధాన్యం కొనుగోళ్లపై రైతులకు తెలియజేయాలన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులేకుండా చూడాలని తెలిపారు. గోనెలు కొనుగోలు కేంద్రాల వద్ద సిద్ధం చేసినట్లు చెప్పారు. ధాన్యంలో తేమ శాతం 17 లోపల ఉండాలని, మట్టిపెల్లలు, రాళ్లు ఒక్క శాతం లోపు ఉండాలన్నారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, కొనుగోలు సిబ్బంది పాల్గొన్నారు.



పాచిపెంట : తేమశాతం పరిశీలనపై అవగాహన కల్పిస్తున్న పౌరసరఫరాల శిక్షకురాలు తులసి

కులగణనపై శిక్షణ



పాచిపెంట: కుల గణనపై శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న సచివాలయ ఉద్యోగులు

పాచిపెంట: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సచివాలయ ఉద్యోగులకు ఎంపీడీఓ లక్ష్మీకాంత్ అధ్యక్షతన శనివారం శిక్షణ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ, కులగణన ఈనెల 27 నుంచి మొదలవుతుందన్నారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు డోర్ టు డోర్ సర్వే నిర్వహించాలన్నారు. ప్రజలు స్వేచ్ఛగా ఈ సర్వేలో పాల్గొనే విధంగా ముందస్తు సమాచారం అందజేయాలన్నారు. కులగణనలో ప్రజలు చెప్పే కులానికి సంబంధించి ఎటువంటి ఆధారాలు ప్రజలను అడగరాదని స్పష్టం చేశారు.



పార్వతీపురం టౌన్: మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు

పార్వతీపురంలో..

పార్వతీపురం టౌన్: పురపాలక సంఘ పరిధిలో గల సచివాలయ సెక్రటరీలకు కమిషనర్ రామప్పలనాయుడు ఆధ్వర్యంలో కులగణనపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈనెల 27 నుంచి నిర్వహించనున్న కులగణనపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండేలా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. కులగణనతో పాటు ఆరోగ్య, సామాజిక, ఆర్థిక, విద్య, తదితర సమాచారాన్ని సేకరించాలని సూచించారు. 1931 తర్వాత నిర్వహిస్తున్న ఈ కులగణన కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఆర్టీసీ ఆధ్వర్యంలో 'పంచక్షేత్ర దర్శిని'



జిల్లా ప్రజారవాణా అధికారి టీవీఎస్ సుధాకర్

పార్వతీపురంటౌన్: హిందువులకు ఎంతో పవిత్రమైన కార్తీకమాసం సందర్భంగా జిల్లా కేంద్రం నుంచి పంచక్షేత్ర దర్శిని పేరిట ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామని జిల్లా ప్రజా రవాణా అధికారి టీవీఎస్ సుధాకర్ తెలిపారు. శనివారం స్థానిక డీపీటీఓ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, కార్తీకమాసం ప్రతి సోమవారం పార్వతీపురం బస్టాండ్ నుంచి పుణ్యక్షేత్రాలకు బస్సులను నడుపుతామన్నారు. సంగం -సంగమేశ్వరస్వామి, నారాయణపురం - నీలకంఠేశ్వరస్వామి, అడ్డాపుశీల- కాశీవిశ్వేశ్వరస్వామి, గుంప- సోమేశ్వరస్వామి, పిట్టలవలస - నీలకంఠేశ్వరస్వామి ఆలయాలకు ప్రతి సోమవారం ఆర్టీసీ సర్వీస్‌లుంటాయని చెప్పారు. శివాలయాలను దర్శించుకొనేందుకు ఆసక్తి ఉన్నవారు 73828 34904 నంబర్‌కు ఫోన్ చేసి టికెట్లు బుక్ చేసుకోవచ్చన్నారు. అలాగే ఏపీఎస్ఆర్‌టీసీ ఆన్‌లైన్.ఇన్‌లోను.. ఆథరైజ్డ్ ఏజెంట్ల వద్ద టికెట్లు బుక్ చేసుకోవచ్చునని తెలిపారు.

నేటి నుంచి వీరఘట్టం-పాలకొండ నైట్‌హాల్ట్ బస్సు

వీరఘట్టం: వీరఘట్టం-పాలకొండ నైట్‌హాల్ట్ బస్సును ఆదివారం నుంచి నడపనున్నట్లు పాలకొండ ఆర్‌టీసీ డిపో మేనేజర్ టి.వెంకటేశ్వరరావు ఓ ప్రకటనలో శనివారం తెలిపారు. ప్రతీరోజు రాత్రి 9.30 గంటలకు పాలకొండ నుంచి బయలుదేరి వీరఘట్టం చేరుకుంటుందని, ఇదే బస్సు మరుసటి రోజు ఉదయం 4.45 గంటలకు వీరఘట్టం నుంచి బయలుదేరి పాలకొండ చేరుకుంటుందని పేర్కొన్నారు. ప్రయాణికులు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇదిలా ఉండగా, వీరఘట్టం నుంచి విశాఖపట్నానికి ఫస్ట్ బస్సు నడపాలని స్థానికులు కోరుతున్నారు.

21న అప్రెంటీస్ మేళా

సీతంపేట: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 21వ తేదీన అప్రెంటీస్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎం.గోపాలకృష్ణ ఓ ప్రకటనలో శనివారం వెల్లడించారు. మేధా సర్వో ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ, జీడిమెట్ల, హైదరాబాద్ వారు ఇంటర్వ్యూ ద్వారా ఉద్యోగాలకు అభ్యర్థులను ఎంపిక చేస్తుందన్నారు. 18 నుంచి 25 ఏళ్ల మధ్య వయసున్న పురుషులు మాత్రమే అర్హులని, నెలకు రూ.14,215 వేతనంతో పాటు అదనపు అలవెన్సులు ఉంటాయన్నారు. ఫిట్టర్ విభాగానికి సంబంధించి 120, ఎలక్ట్రికల్‌లో మరో 120, మెకానిక్‌లో 50 ఖాళీలున్నాయన్నారు. మేళాకు వచ్చేవారు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలన్నారు. ఎంపికైన వారికి ప్లేస్‌మెంట్ ఇవ్వడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్లు 9390063881, 9441930405ను సంప్రదించాలని కోరారు.

పక్కాగా శిశు ఆరోగ్య కార్యక్రమాలు



అవగాహన కల్పిస్తున్న జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి జగన్మోహనరావు

- జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి జగన్మోహనరావు

మక్కువ: శిశు ఆరోగ్య కార్యక్రమాలు పక్కాగా నిర్వహించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి, డాక్టర్ టి.జగన్మోహనరావు కోరారు. మండలంలోని మక్కువ, శంబర పీహెచ్‌సీలను శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఐదేళ్లలోపు పిల్లలకు సంబంధించిన ఆరోగ్య కార్యక్రమాలను వైద్య సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది సమన్వయంతో నిర్వహించాలని సూచించారు. ప్రాణాంతకమైన న్యూమోనియా వ్యాధి లక్షణాలను సులభంగా గుర్తించాలన్నారు.

జలుబు, దగ్గు ఎక్కువగా ఉండి అధిక జ్వరం, ఛాతి కొట్టుకోవడం, తినాలనిపించకపోవడం, తాగాలనిపించకపోవడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు వంటి లక్షణాలు కనిపిస్తే న్యూమోనియాగా గుర్తించాలన్నారు. అనంతరం శంబర, కన్నంపేట అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు జి.హరికృష్ణ, వి.కిరణ్‌కుమార్, ఎం.నిఖిల, సూపర్‌వైజర్లు వెంకటరత్నం, సరస్వతి, జయగౌడ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

ఓటరుగా నమోదుకండి..



మాట్లాడుతున్న ఆర్డీఓ హేమలత

- ఆర్డీఓ హేమలత

పార్వతీపురం టౌన్: యువత ఓటరుగా నమోదై ఎన్నికల్లో ఆదర్శంగా నిలవాలని రెవెన్యూ డివిజనల్ అధికారి కె. హేమలత పిలుపునిచ్చారు. ఓటరు నమోదుపై శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, 18 సంవత్సరాలు పూర్తయిన వారు ఓటర్లుగా నమోదు కావాలని సూచించారు. 2024 జనవరి 1వ తేదీనాటికి 18 ఏళ్లు పూర్తయిన వారు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. డిసెంబర్ 2, 3 తేదీల్లో ప్రత్యేక ఓటు నమోదు కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలో చేపట్టనున్నట్లు చెప్పారు. అక్టోబర్ 27న ముసాయిదా ఓటరు జాబితాను విడుదల చేశామని... జాబితాపై ఎటువంటి అభ్యంతరాలున్నా డిసెంబర్ 9 వరకు స్వీకరిస్తామన్నారు. 2024 జనవరి 5న ఓటర్ల తుది జాబితా ప్రచురణ సిద్ధమవుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ చలపతిరావు, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

వార్షిక ప్రణాళికలు సిద్ధం చేయండి

వీరఘట్టం: ప్రతీ పాఠశాలకు సంబంధించి, వార్షిక ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎంఈవో ఆర్.ఆనందరావు సూచించారు. శనివారం మండల కేంద్రంలోని ఎంఈవో కార్యాలయంలో మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశమైన ఆయన వచ్చే విద్యాసంవత్సరానికి కావాల్సిన వసతులు అందుకు అవసరమైయ్యే ఖర్చుతో కూడిన వివరాలను తెలియజేయాలన్నారు. కచ్చితమైన ప్రణాళికలు రూపొందించి, పాఠశాల అభివృద్ధికి దోహదపడాలని కోరారు.

రైతులను మోసగిస్తే క్రిమినల్ కేసు



వలంటీర్లకు సూచనలిస్తున్న ఏవో శంకరరావు

కొమరాడ: ధాన్యం కొనుగోలులో రైతులను మోసగించే వారిపై క్రిమినల్ కేసు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయాధికారి పి.శంకరరావు అన్నారు. శనివారం మండలంలోని గుణానపురం, విక్రంపురం గ్రామ సచివాలయాల ఆవరణలో ధాన్యం కొనుగోలుపై వలంటీర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలులో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. దళారుల బారినపడి రైతులు నష్టపోకుండా అవగాహన కల్పించాలన్నారు. రైతులను ఎవరైనా మభ్యపెడితే వెంటనే టోల్‌ఫ్రీ నంబర్ 1967కు ఫోన్ చేయాలన్నారు.